క్లుప్తంగా

నేడు వరి విత్తనాల పంపిణీ



రాజవొమ్మంగి ఆర్బీకే వద్ద వరి వంగడాలు

రాజవొమ్మంగి: స్థానిక రైతు భరోసా కేంద్రం వద్ద మంగళవారం ఉదయం 10 గంటలకు వరి విత్తనాల పంపిణీ చేస్తామని ఏవో రమేష్ నాయుడు తెలిపారు. మండలానికి 1,360 క్వింటాళ్ల వరి విత్తనాలు అవసరమని ప్రతిపాదనలు పంపించామన్నారు. ఇప్పటికే ఆయా రైతు భరోసా కేంద్రాలకు 841 క్వింటాళ్ల వరి వంగడాలు చేరుకున్నాయని, వాటి పంపిణీ కోసం రంగం సిద్ధం చేశామన్నారు. మండలంలోని గిరిజన రైతులకు ప్రభుత్వం 90 శాతం సబ్సిడీపై వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న సంగతి తెలిసిందే. అధిక దిగుబడులిచ్చే పలు రకాల నాణ్యమైన నూతన వరి వంగడాలను ప్రభుత్వం సరఫరా చేస్తోందన్నారు. నేల స్వభావాన్ని బట్టి విత్తన రకాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు.

హుకుంపేటలో పారిశుధ్య మెరుగు పనులు



హుకుంపేటలో డ్రైనేజీ చెత్త తొలగిస్తున్న దృశ్యం

హుకుంపేట: స్థానిక వీధి డ్రైనేజీ కాలువల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాలను తొలగించినట్లు పంచాయతీ కార్యదర్శి సాగర్ తెలిపారు. సోమవారం ఆయన క్లాప్ మిత్రల ద్వారా వీధి కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలను, మురుగును దగ్గరుండి తొలగించే చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక దుకాణదారులతో మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇక్కడ రోడ్ల పక్కన చెత్త ఎక్కువగా ఉండడం వల్ల ఇబ్బందిగా మారిందన్నారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ పడేయకుండా పంచాయతీ సూచించిన ప్రదేశంలో వేయాలన్నారు. త్వరలోనే డస్ట్‌బిన్లు ఏర్పాటు చేస్తామన్నారు.

పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి పదవికి రాజీనామా

రాజవొమ్మంగి: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పర్సన్ ఇన్‌చార్జ్ / చైర్మన్‌గా తన పదవికి రాజీనామా చేసినట్లు శింగిరెడ్డి రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త ప్రభుత్వం ఏర్పడుతున్నందున నైతిక బాధ్యతగా రాజీనామా చేశానన్నారు. తనకు ఈ పదవి దక్కడంలో కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్‌లకు, అన్ని విధాలుగా సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలని ఈ సందర్భంగా తెలిపారు.

ఖరీఫ్ వరి సాగుకు సిద్ధం



జీడి తోటలో దుక్కు దున్నుతున్న రైతన్న

రాజవొమ్మంగి: కొద్ది రోజులుగా ఏజెన్సీ వ్యాప్తంగా తొలకరి వర్షాలు ఆశాజనకంగా కురుస్తుండగా, రైతులు ఖరీఫ్ వరి సాగుకు సమాయత్తం అవుతున్నారు. మృగశిర కార్తె ప్రారంభంలో వరి నారుమడులు సిద్ధం చేసుకుంటున్నారు. అదే విధంగా తమ భూములను సాగుకు అనువుగా చేస్తున్నారు. పిచ్చిమొక్కలు తొలగించడం, దుక్కులు దున్నే పనుల్లో క్షణం తీరికలేకుండా ముందుకు సాగుతున్నారు. రంపచోడవరం డివిజన్‌లోని ఏడు మండలాల్లో 29,273 ఎకరాల్లో వరి, పత్తి, పొగాకు, నూనెగింజలు తదితర పంటలు సాగవుతున్నాయి. మరో 35,931 ఎకరాల్లో మామిడి, జీడి, పనస, నిమ్మ, నారింజ తదితర పండ్ల తోటలను సాగు చేస్తున్నారు.

గిరిజన పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

చింతపల్లి రూరల్: మండలంలో వంగసార ప్రభుత్వ గిరిజన సంక్షేమ శాఖ బాలికల పాఠశాలలో ఖాళీ సీట్లు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తునట్లు ప్రధానోపాధ్యాయుడు ప్రసాదరావు తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికిగాను మూడు నుంచి పదో తరగతి వరకు ఖాళీలకు సంబంధించిన వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని సూచించారు. అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు పాఠశాలను సందర్శించాలన్నారు.

మోదకొండమ్మ తల్లి ఉత్సవాలు

- నేడు అనుపోత్సవానికి ఏర్పాట్లు
- ఆకట్టుకుంటున్న విద్యుత్ లైటింగ్



జెయింట్ వీల్ ఏర్పాటు చేసిన దృశ్యం



భారీగా విద్యుత్ లైటింగ్ ఏర్పాటు చేసిన దృశ్యం

పెదబయలు: మన్య ప్రజల ఆరాధ్య దైవం మోదకొండమ్మ తల్లి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల సందర్భంగా పెదబయలులో అమ్మవారి గుడి ఆవరణ నుంచి స్టేట్ బ్యాంకు వరకు భారీ విద్యుత్ లైటింగ్‌తో అలంకరణ ఏర్పాటు చేశారు. గాంధీబొమ్మ సెంటర్ ఏర్పాటు చేసిన స్టేజ్‌ల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వారపు సంత గ్రౌండ్‌లో జెయింట్ వీల్, ఇతర వినోద ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మంగళవారం ఉదయం తెల్లవారుజాము నుంచే అమ్మవారి ఆలయంలో భక్తులు మొక్కులు చెల్లించుకోనున్నారు. ఈ మేరకు శతకం పట్టులో కొలువైన అమ్మవారికి ప్రత్యేక పూజలు అనంతరం మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఊరేగింపు కార్యక్రమం ప్రారంభం అవుతుంది. రాత్రి అమ్మవారిని, పాదాలు ఘటాలను ఆలయం వద్దకు చేర్చి భారీగా మందుగుండు సామగ్రిని కాలుస్తారు. అనుపోత్సవానికి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు జి. మాడుగుల సీఐ రమేష్, ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపారు. అనుపోత్సవం విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ గ్రామ పెద్దలు కోరారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి సభ్యులతోపాటు గిరిజనులు

రాజవొమ్మంగి: మండలంలోని కరుదేవపాలెం, చికిలింత, కొమరాపురం, వాతంగి, పూదూడి, ఓకుర్తి గ్రామాల్లో సోమవారం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం కార్యక్రమం నిర్వహించారు. ఆచార ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక గ్రంథాలను ప్రదర్శనకు పెట్టి వాటి ప్రాశస్త్యం వివరించారు. జీవాత్మ, ఆత్మ, పరమాత్మల గురించి విశదీకరించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక (రాజమహేంద్రవరం) కమిటీ అధ్యక్షుడు శేఖర్‌బాబు, సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా షిర్డీసాయి మందిర వార్షికోత్సవం



పాతగంగవరంలో అన్నదాన కార్యక్రమం

గంగవరం: పాత గంగవరం రామాలయం వద్ద షిర్డీ సాయి మందిర ప్రథమ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. పాత గంగవరం శ్రీరామదాసు రామాలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ వేడుక అత్యంత వైభవంగా నిర్వహించారు. షిర్డీ సాయిబాబా విగ్రహ దాతలు కొమ్మన చిన్నారావు, విజయలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించగా, భారీగా సాయి భక్తులు పాల్గొన్నారు. అనంతరం మహా అన్నదానాన్ని నిర్వహించారు. రాత్రి 7 గంటల నుంచి అడ్డతీగల సాయి సత్సంగ భజన మండలి ఆధ్వర్యంలో భజన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించి బాబా ప్రసాదాన్ని వితరణ చేశారు.

అంతా మా ఇష్టం!

- రోడ్డుపైనే ఇంటి నిర్మాణ సామగ్రి



స్టేట్ బ్యాంక్ వెళ్లే రోడ్డు మీద వేసిన ఇసుక...

అరకులోయ రూరల్: స్థానిక స్టేట్ బ్యాంకుకు వెళ్లే రహదారిలో ఇంటి నిర్మాణ సామగ్రి వేయడంతో రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఓ ఇంటి యాజమాని ఇంటి నిర్మాణానికి కావాల్సిన ఇసుక, రాళ్లు, సిమెంట్ కాలనీకి వెళ్లే రహదారిలో వేస్తుండడంతో స్టేట్ బ్యాంక్ ఖాతాదారులు సైతం రాకపోకల సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంటి నిర్మాణ సామగ్రి ఇష్టారాజ్యంగా వేస్తుండడంతో దీనిపై చర్యలు చేపట్టాలని, కాలనీ వాసులు కోరుతున్నారు.

నేటి నుంచి గంగాలమ్మ తల్లి జాతర



మాతశ్రీ కనకవర్షిణీ గంగాలమ్మ తల్లి

మారేడుమిల్లి: గ్రామ దేవత మాతశ్రీ కనక వర్షిణీ గంగాలమ్మ తల్లి జాతర మంగళవారం మారేడుమిల్లిలో ప్రారంభం కానుంది. మిరమిట్లు గొలిపే విద్యుత్ కాంతుల మధ్య అంగరంగ వైభవంగా జాతర నిర్వహించడానికి ఉత్సవ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. అయిదు రోజుల పాటు ఈ ఉత్సవాలు జరుగుతాయి. తొలి రోజు గ్రామస్తులతో అమ్మవారికి కుంకుమ పూజా కార్యక్రమం, అనంతరం బోనాల ఊరేగింపు, గిరిజన పూజారులతో పూజా కార్యక్రమం, సాయంత్రం గరగలాట, థింసా, తీన్మార్ వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. అయిదు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో రోజూ పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. ఈ ఉత్సవాలకు మారేడుమిల్లితో పాటు చుట్టు పక్కల గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో తరలివస్తారు.

అలరించిన గీతాలు



విజేతలతో ఈశ్వరరావు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం గౌరీగ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పాటల పోటీలు ఆహూతులను అలరించాయి. ఈ పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా 40 మంది గాయకులు పాల్గొని, గీతాలు ఆలపించారని జీఆర్‌కే స్వరగమనం సంస్థ వ్యవస్థాపకుడు గేదెల ఈశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా భవిత స్కూల్ ఆఫ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో చిన్నారులు పాశ్చాత్య, జానపద, శాస్త్రీయ నృత్యాలు ప్రదర్శించారు. విజేతలకు ఈశ్వరరావు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో అకాడమీ వ్యవస్థాపకులు పెంటకోట లీలావతి, గాయకులు అజయ్, బాలకృష్ణ, గౌరీ, శ్రీనివాస్, రాము, శంకర్, ధరణి తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలు, మేకల అమ్మకాల జోరు

- తాళ్లపాలెం వారపు సంత కిటకిట
- రూ.30 లక్షల వరకు లావాదేవీలు
- ఆనందం వ్యక్తం చేసిన వ్యాపారులు



కొనుగోలు చేసిన మేకలను వ్యాన్లలో తరలిస్తున్న వ్యాపారులు



తాళ్లపాలెం సంతలో విక్రయానికి తీసుకొచ్చిన గొర్రెలు, మేకల మందలు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం వారపు సంతలో సోమవారం అమ్మకానికి మేకలు, గొర్రెలు భారీగా వచ్చాయి. ఎన్నికల కోడ్ ముగియడంతో గ్రామాల్లో ఉత్సవాలు, పండగలు ఘనంగా నిర్వహించుకునే అవకాశంతో మేకలు, గొర్రెల అమ్మకాలు జోరుగా సాగాయి. సాధారణంగా సంతకు వెయ్యిలోపు మాత్రమే అమ్మకానికి వస్తాయి. ఈ వారం ఆ సంఖ్య దాదాపు 1,500 వరకు ఉంది.

పొరుగు జిల్లాల నుంచి రాక

సంతకు జిల్లాతోపాటు అల్లూరి సీతారామరాజు జిల్లా, కాకినాడ జిల్లాల నుంచి పెంపకందారులు, వ్యాపారులు అమ్మకానికి తీసుకొచ్చారు. వీటిని విశాఖ, గాజువాక, అనకాపల్లితోపాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి కొనుగోలుదారులు, వ్యాపారులు, హోటళ్లు, ఉత్సవాల నిర్వాహకులు, మాంసం ప్రియులు తరలి వచ్చి ముమ్మరంగా కొనుగోలు చేశారు. పొట్టేళ్లు, ఆడ గొర్రెలు, మేకలు, మేకపోతులు, గొర్రెల మందలను కొనుక్కుని వ్యాన్లు, ఆటోల్లో తమ వెంట తరలించుకెళ్లారు. సుమారు రూ.30 లక్షల వరకు లావాదేవీలు సాగాయి. గొర్రె, మేకల పరిమాణం అనుసరించి రూ.5 వేల నుంచి రూ.30 వేల వరకు ధర పలికింది. గత వారం కంటే రూ.2 వేల వరకు ధర ఎక్కువగా లభించినట్లు వ్యాపారులు, పెంపకందారులు ఆనందం వ్యక్తం చేశారు. సంతలో మేకలు, గొర్రెలు కొనుగోలుకు వ్యాన్లు, ఆటోలు కూడా ఎక్కువగా తరలి రావడంతో తాళ్లపాలెం–నర్సీపట్నం మార్గంలో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ఈ సంగతి తెలియడంతో పోలీసులు వచ్చి రాకపోకలను క్రమబద్ధీకరించారు.



వారపు సంతలో మేకల విక్రయాలు

ధర బాగుంది



వారపు సంతలో గత వారం కంటే మేకలు, గొర్రెలకు ఎక్కువ ధర లభించింది. ఎన్నికల ప్రక్రియ ముగియడంతో నిబంధనలు తొలగి గ్రామాల్లో ఉత్సవాలు, పండగలు మొదలవుతున్నాయి. దీంతో అధికంగా ఈ వారం మేకలు, గొర్రెలు అమ్మకానికి వచ్చాయి. వీటికి గిరాకీ ఏర్పడి ఈ వారం ఎక్కువ ధర లభించడంతో ఆనందంగా ఉంది.

– ఒమ్మి అచ్చిబాబు, గొర్రెలు, మేకల వ్యాపారి, సబ్బవరం

ఇదే జీవనాధారం



వేసవి ముగిసే వరకు మేకలు, గొర్రెల అమ్మకానికి గిరాకీ ఉంటుంది. వర్షాకాలం వస్తే డిమాండ్ తగ్గుతుంది. జిల్లాలో జరిగే సంతలకు వీటిని తీసుకెళ్లి విక్రయిస్తుంటాం. తక్కువ ధరకు కొని ఎక్కువ ధర వచ్చే సంతలో అమ్ముతుంటాం. వచ్చిన ఆదాయంతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాం. సీజన్ కావడంతో అమ్మకాలు ఆశాజనకంగా ఉన్నాయి.

– దేవర కన్నబాబు, వ్యాపారి, మాకవరపాలెం

డిగ్రీ కళాశాల అభివృద్ధికి చర్యలు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ భారతి

చింతపల్లి రూరల్: స్థానిక డిగ్రీ కళాశాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటునట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ భారతి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ తమ డిగ్రీ కళాశాలకు కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.5 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఈ మేరకు కళాశాల రూపురేఖలు మారనున్నాయని, ఈ నిధులతో మరమ్మతులు, నూతన భవనాలు నిర్మించి, అత్యాధునిక హంగులు ఏర్పాటు చేస్తామన్నారు. కళాశాలలో విద్యార్థులకు డిజిటల్ లైబ్రరీ, పలు రకాల ల్యాబ్‌లు, జిమ్, సెమినార్ హాల్, ప్రొజెక్టర్ వంటి వాటిని అందుబాటులోకి తీసుకువచ్చి కార్పొరేట్ కళాశాలలకు దీటుగా తీర్చుదిద్దుతామన్నారు. మిగిలిన కళాశాలలతో పోల్చితే మన్య ప్రాంతంలో విద్యార్థుల సంఖ్య అధికంగా ఉందన్నారు. కళాశాలలో ఉన్న కోర్సులతోపాటు అదనంగా మరిన్ని కోర్సులు ఈ సంవత్సరం చేర్చడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో డిగ్రీతోపాటు పీజీ విద్య అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. మొత్తం మూడు సంవత్సరాలకు సంబంధించి 871 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని, ఈ విద్య సంవత్సరానికిగాను అన్ని కోర్సులు కలుపుకుని మొదటి సంవత్సరంలో 420 సీట్లు ఖాళీగా ఉన్నట్లు ఆమె తెలిపారు. ఈ కోర్సులకు సంబంధించి వివరాలు స్థానిక డిగ్రీ కళాశాల నోటీసు బోర్డులో ఉంచామన్నారు. అర్హత ఉన్న విద్యార్థులు కళాశాలలో సంప్రదించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ పాత్రుడు, అధ్యాపకులు డాక్టర్ రమణ, డాక్టర్ తేజ, లీలాపావని, రవీంద్రనాయక్, సంతోషి, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

సోమాలమ్మ మహోత్సవాలు ప్రారంభం



కాంతులీనుతున్న సోమాలమ్మ అమ్మవారు

అడ్డతీగల: సోమాలమ్మ మహోత్సవాలు సోమ వారం అడ్డతీగలలో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. జాతరకు అంకురార్పణగా తొలుత అమ్మవారికి నేత్రాలు అలంకరించి, అనంతరం ప్రత్యేక పూజాధి కార్యక్రమాలు నిర్వహించారు. కొత్త చీరలు అలంకరించి అమ్మవారి చెంతనే ఉంచిన గరగలతో డప్పు వాయిద్యాల నడుమ వేడుకగా గ్రామంలో ప్రవేశించారు. వీధుల్లో అమ్మవారికి చీర, సారె తీసుకురావడానికి తరలివెళ్లారు. అలా వెళుతున్న గరగలాడే కళాకారులను భగవత్స్వరూపంగా భావించి వారి పాదాలను పసుపు నీళ్లతో కడిగి కుంకుమద్ది పలువురు మహిళలు నమస్కరించుకున్నారు. ఓ పక్క ఈ కార్యక్రమం జరుగుతుండగానే, మరో బృందం తరలివెళ్లి ఊయల రాటలను ఊరేగింపుగా తీసుకొచ్చింది. ఈ సందర్భంగా గరగ నృత్యాలు, చిత్ర విచిత్ర వేషధారణలు ప్రజలను ఆకట్టుకున్నాయి.

190 మంది గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు



వై.రామవరం: చవిటిదిబ్బలు పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య పరీక్షలు



వై.రామవరం సీహెచ్‌సీలో గర్భిణులకు స్కానింగు నిర్వహిస్తున్న గైనికాలజిస్టు

వై.రామవరం: పీఎంఎస్‌ఎంఏ కార్యక్రమంలో భాగంగా వై.రామవరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లోను, చవిటిదిబ్బలు పీహెచ్‌సీలోను సోమవారం 190 మంది గర్భిణులుకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ రాహుల్ ఆధ్వర్యంలో 105 మందికి, చవిటిదిబ్బలు పీహెచ్‌సీ సూపరింటెండెంటు డాక్టర్ దినేష్ ఆధ్వర్యంలో 85 మంది గర్భిణులకు స్కానింగ్, రక్తపరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వారిలో 72 మంది హైరిస్క్ గర్భిణులను గుర్తించి ఆయా ఆస్పత్రుల్లో చేర్పించారు. వారికి ప్రత్యేక వైద్య సేవలందించి, అవసరమైన మందులు అందించారు. ఈ శిబిరానికి హాజరైన గర్భిణులందరికీ భోజన వసతి, రవాణా సౌకర్యాలు కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ గైనికాలజిస్టు తపస్వి, వైద్యాధికారి నరేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణ మందు పిచికారీ పూర్తి



రాజవొమ్మంగిలో అవగాహన ర్యాలీ చేస్తున్న అధికారులు, సిబ్బంది

రాజవొమ్మంగి: మండలంలోని రాజవొమ్మంగి, జడ్డంగి, లాగరాయి పీహెచ్‌సీ పరిధిలోని మలేరియా పీడిత గ్రామాల్లో దోమల నివారణ మందు ద్రావణం స్ప్రేయింగ్ మొదటి విడత పనులు సోమవారం పూర్తయ్యాయి. ఈ మేరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండలంలోని దాదాపు అన్ని గిరిజన సంక్షేమ, గురుకుల పాఠశాలల లోపల, బయట ఏసీఎం–5 శాతం మందు ద్రావణం స్ప్రే చేశామని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ప్రసాద్ తెలిపారు. రెండో విడతగా జూలై ఒకటి నుంచి 30వ తేదీ వరకు స్ప్రేయింగ్ పనులు మొదలు పెడతామన్నారు. ఏఎంవో శ్రీనివాస్‌రాజు మెడికల్ ఆఫీసర్లు యామినీప్రియ, నాగార్జున, సుష్మ, ఎంటీఎస్ సోమరాజారెడ్డి, హెచ్‌ఏలు శామ్యూల్, రాజుబాబు, పెద్దిరాజు, రామిరెడ్డి, లక్ష్మణ్‌బాబు, నానిబాబు పర్యవేక్షించారు.

ఆంజనేయ స్వామి విగ్రహావిష్కరణ



విగ్రహావిష్కరణ చేస్తున్న స్వామిజీ

కొయ్యూరు: బకులూరులో ఆంజనేయ స్వామి విగ్రహాన్ని భీమిలికి చెందిన సాయిరాం స్వామిజీ సోమవారం ఆవిష్కరించారు. పుట్టపల్లి గోపాలకృష్ణ, అలిషా దంపతులు, ధారకొండ ఉమామహేశ్వరరావు, స్వాతి దంపతులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామిజీ మాట్లాడుతూ ఇప్పటి వరకు 732 విగ్రహాలు ఏర్పాటు చేశామన్నారు. ఎవరైనా ముందుకు వస్తే విగ్రహాలు ఇస్తామన్నారు. దీనిలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ఉపాధ్యాయుడు జేవీ గిరిబాబు గ్రామ పెద్దలు పెయ్యల దేవుడు, జల్లి బాబులు, కోపూరి లక్ష్మణరావు, రాంబాబు పాల్గొన్నారు.

కార్మికులను పర్మినెంట్ చేయాలి

అనకాపల్లి: మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని జీవీఎంసీ మున్సిపల్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ (ఏఐటీయూసీ) వర్కింగ్ ప్రెసిడెంట్ కాసారపు సత్యనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు.